సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 22 । జనవరి । 2023



శాస్త్రీయ దృక్పథంతోనే ఆలోచనల అభివృద్ధి

ఆలోచనలు శాస్త్రీయ దృక్పథంతో సాగితే సమాజం అభివృద్ధి చెందుతుందని జేవీవీ నాయకుడు లక్ష్మణరావు అన్నారు. - 8లో



విజిలెన్స్ అధికారుల దాడులు

కడప విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లపై దాడులు నిర్వహించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.4/17.4

జిల్లాలో శనివారం 17.4 – 30.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

25లోపు ఇన్‌స్పైర్ అవార్డు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 2021–22 విద్యా సంవత్సరానికి జిల్లాస్థాయికి ఎంపికైన 351 మంది విద్యార్థులు ప్రాజెక్టు వీడియోను, వారి ప్రాజెక్టు ఫొటోను, ప్రాజెక్టు ఆడియోను నిర్దేశించిన నమూనాలో ఇన్‌స్పైర్ అవార్డు యాప్‌లో ఈనెల 25వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని డీఈఓ దేవరాజు, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డిలు తెలిపారు. జిల్లాస్థాయికి ఎంపికైన 351 మంది విద్యార్థులు సంబంధిత గైడ్ టీచర్లు విద్యార్థులచే ప్రాజెక్టులను సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు.

రేపు శాప్‌లీగ్ హాకీ జిల్లా ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు శాప్ లీగ్ ఫేజ్–22 డిస్ట్రిక్ లెవెల్ హాకీ ఎంపికలను ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కడప డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృతరాజ్‌లు తెలిపారు. ఈ ఎంపికలు అండర్ –12 బాలురకు మాత్రమేనని పేర్కొన్నారు. ఎంపికైన వారు జనవరి 31వ తేదీ, ఫిబ్రవరి 1వ తేదీన కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి శాప్ లీగ్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9121106839, 6300664935 నంబర్లలో సంప్రదించాలని వారు తెలిపారు.

రేపు 'ప్రత్యేక విద్యుత్ అదాలత్'

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 23వ తేదీ సోమవారం 'ప్రత్యేక విద్యుత్ అదాలత్' నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కడప మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.



ఆర్టీసీకి పండగే పండగ

- కోవిడ్ తర్వాత సంక్రాంతికి భారీగా ప్రయాణికులు
- సాధారణ చార్జీల వసూలుతో ఆర్టీసీకి పెరిగిన ఆదరణ
- ప్రభుత్వ నిర్ణయంతో ఒనగూరిన ఆదాయం
- అధికారులు, సిబ్బందిలో ఆనందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ గేర్‌మార్చి స్పీడు పెంచింది. ఫలితంగా సంక్రాంతి పండుగ ఆర్టీసీకి బాగా కలిసొచ్చింది. ఒకవైపు నష్టాల నుంచి కోలుకుని లాభాలతో రోడ్డెక్కుతోంది. రెండేళ్ల పాటు కోవిడ్–19 పరిస్థితుల్లో సంక్రాంతి పండుగకు బంధువులు స్వస్థలాలకు రావడానికి అంతగా మక్కువ చూపలేదు. అప్పుడు ఇళ్లకే పరిమితం అయ్యారు. గడిచిన రెండేళ్లు సంక్రాంతి పండుగ వేళల్లో ప్రయాణాలు సాగించలేదు. వచ్చిన కొద్దిమంది కూడా సొంత వాహనాల్లోనే వచ్చి వెళ్లిపోయేవారు.

స్పెషల్ బాదుడు లేదు

రెండేళ్ల తర్వాత కోవిడ్ విపత్కర పరిస్థితి నుంచి ఉపశమనం లభించింది. దీంతో సంక్రాంతి పండుగకు వేలాది మంది జిల్లాకు తరలివచ్చారు. దాదాపు ఆరురోజుల ముందునుంచి ప్రభుత్వం సెలవులు ఇవ్వడంతో తమ స్వస్థలాలకు వచ్చిన ప్రయాణికులు ఈసారి ఆర్టీసీని బాగా ఆదరించారు. ఇందుకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం కూడా ఆర్టీసీ సంస్థకు బాగా అనుకూలించింది. గతంలో పండుగల సమయంలో స్పెషల్ సర్వీసులతో ప్రయాణికుల టిక్కెట్లపై 1.5 శాతం అదనపు ఛార్జీలు విధించేవారు. అయితే ప్రభుత్వం ఈసారి అదనపు ఛార్జీలను పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీయే మేలని ప్రజలకు ఒక నమ్మకం కుదిరింది. మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ ప్రయాణికుల అవసరాన్ని బట్టి టిక్కెట్ ఛార్జీలను భారీగా పెంచింది. ఒకవైపు రూ. 2–3 వేల వరకు వసూలు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి దోపిడీని నియంత్రించగలిగారు.

సంక్రాంతికి ముందు

డిపో	బస్సులు	వచ్చిన ఆదాయం (రూపాయల్లో)
కడప	58	15,77,720
పులివెందుల	36	10.90,767
బద్వేలు	25	7,29,496
జమ్మలమడుగు	19	499919
మైదుకూరు	13	370736
ప్రొద్దుటూరు	35	859952
మొత్తం	186	51,28,590

సంక్రాంతి తర్వాత

డిపో	బస్సులు	వచ్చిన ఆదాయం (రూపాయల్లో)
కడప	53	14,10,484
పులివెందుల	24	6,88,235
బద్వేలు	26	7,65,622
జమ్మలమడుగు	17	4,37,587
మైదుకూరు	09	2,28,002
ప్రొద్దుటూరు	29	5,91,603
మొత్తం	158	41,21,533

భారీగా రాకపోకలు

వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయితే ఎక్కువ మంది హైదరాబాదు పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరుచుకుని ఉంటున్నారు. అలాంటి వారంతా సంక్రాంతి పండుగ మూడు రోజులు మాత్రం స్వస్థలాలకు కుటుంబ సమేతంగా వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి 20–30 వేల మంది ఆర్టీసీ బస్సుల్లో జిల్లాకు చేరుకున్నారు. మరోవైపు విమానాలు, రైల్వే, ప్రైవేటు ట్రావెల్స్, వ్యక్తిగత వాహనాల్లో కూడా జిల్లాకు చేరుకున్నారు.

ఆదరణ బాగుంది



సంక్రాంతి పండుగ ఆర్టీసీకి బాగా కలిసొచ్చింది. ఒకవైపు ప్రైవేటు ట్రావెల్స్‌లో అధిక ఛార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వచ్చారు. సంక్రాంతి ముందు, తర్వాత కూడా ఒకే రకంగా ప్రయాణించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమంటే సురక్షితం కావడంతో సంస్థకు ఆదరణ పెరగడంతోపాటు ఆక్యుపెన్సీ రేషియో కూడా పెరిగింది.

– గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

బ్రహ్మోత్సవం.. ప్రారంభం



కడప రాయుని సన్నిధిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

కడప రాయుడు కప్పురపు రాయుదయ్యాడు. బ్రహ్మాండ నాయకుడు బ్రహ్మోత్సవ కళను సంతరించుకున్నాడు. పరిసరాలన్నింటికీ కొత్త పరిమళాలను సంతరించి పెట్టాడు. జిల్లాకే తలమానికంగా నిలిచే తిరుమల వాసుని ప్రతిరూపంగా కడప గడపను దివ్యంగా వెలిగిస్తూ అంతటా ఉత్సవ శోభను కల్పించాడు. నేటి నుంచి పది రోజులపాటు రోజుకో వాహనంపై దివ్య తేజంతో వెలిగిపోనున్నాడు. ఆ మహా మంగళమూర్తి బ్రహ్మోత్సవాలు ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసినా తనవి తీరదు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ



అంకురార్పణసేవలో వేద పండితులు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్‌లతోపాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. రక్షా కంకణధారణ నిర్వహించిన అనంతరం పల్లకీలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు టీటీడీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాన్ని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ చేశారు. ప్రత్యేక విద్వాంసుల నాదస్వర, మంగళ వాయిద్యాల విన్యాసాల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించిన అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: ఆదివారం ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు తిరుచ్చి ధ్వజారోహణం, సాయంత్రం 6.00 నుంచి 7.00 గంటల వరకు ఊంజల సేవ, రాత్రి టీటీడీ అన్నమాచార్యప్రాజెక్టు కళాకారుల అన్నమాచార్యుల సంకీర్తనలు నిర్వహిస్తారు. రాత్రి 7.00 నుంచి 8.00 గంటల వరకు ఉత్సవ మూర్తులను చంద్రప్రభ వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు.

సగటు జీవితాల 'అష్క్'

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- ఘనంగా పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : 'అష్క్' పుస్తకంలోని కథలన్నీ సగటు జీవితాలను ప్రతిబింబిస్తాయని, ప్రతి హృదయాన్ని స్పృశించి కన్నీళ్లు తెప్పిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష అన్నారు. కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో యువ రచయిత షేక్ షబ్బీర్ హుసేన్ రచించిన కథల సంపుటి 'అష్క్'ను శనివారం ఆయన ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ సమయంలోనే షబ్బీర్ రాసిన కథలన్నీ పుస్తకంగా రావడం, అందులో సగానికి పైగా కథలు బహుమతులు పొందడం విశేషమన్నారు. ఆయన భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఎవరి జీవితాలను వాళ్లే..

కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ముస్లింల జీవితాలపై వచ్చిన కథలు ఆయా రచయితల జీవితాల్లో ఎదుర్కొన్న సంఘటనలే కావడం విశేషమన్నారు. రచయితలు సమాజంలోని సంక్లిష్టతను అర్థం చేసుకునే దిశగా వెళ్లడం అభినందనీయమన్నారు. షబ్బీర్ కథల్లో ముస్లింల జీవితాల సహజ రూపం కనిపిస్తుందని, ఎవరి జీవితాలను వాళ్లే సరైన కోణంలో విశ్లేషించగలరని, షబ్బీర్‌కు ముస్లింల కడగండ్లను కథలుగా రాసేందుకు ఈ కోణం ఉపయోగపడిందని భావిస్తున్నామన్నారు.

సజీవ చిత్రాలు

షబ్బీర్ రచించిన కథలన్నీ సజీవ చిత్రాలని సీనియర్ కథా రచయిత షేక్ హుసేన్ సత్యాగ్ని అభివర్ణించారు. భారతీయతలో మమేకమైన ముస్లింల గురించి ఈ కథలు చెబుతాయన్నారు. మతం జోలికి వెళ్లకుండా కథకుడిగా షబ్బీర్ జీవిత సంఘర్షణలను మాత్రమే తెలుపడం ఆయన నైపుణ్యాన్ని తెలుపుతోందన్నారు.

జీవితం, సమాజ సంఘర్షణల ఏకీకృత రూపం

అష్క్ అంటే కన్నీళ్లని.. జీవితం, సమాజంలోని సంఘర్షణలను షబ్బీర్ తన కథల్లో ఏకీకృతం చేశారని సాహిత్య పరిశోధకులు తవ్వా వెంకటయ్య అన్నారు. కథల సంపుటిని సమీక్షించి ప్రతి కథను భిన్నమైన కోణాల్లో విశ్లేషించి దాని గొప్పతనాన్ని తెలిపారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి, ప్రముఖ కథకులు పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల
రాత పరీక్షలకు పటిష్ట బందోబస్తు



జిల్లా ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో ఆదివారం జరగనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రాథమిక రాత పరీక్షల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. జిల్లా కేంద్రమైన కడపతోపాటు ప్రొద్దుటూరు పట్టణంలో మొత్తం 71 కేంద్రాలలో 36,534 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణకు కడపలో 48 కేంద్రాలలో 24,187 మంది, ప్రొద్దుటూరులో 23 కేంద్రాల్లో 12,347 మంది అభ్యర్థులు రాత పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షా హాలులోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాక ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది ఉండదన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, బ్లూ టూత్ పరికరాలు, వాచ్‌లు పరీక్షా గదిలోకి తీసుకు రాకూడదన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తోపాటు ఒరిజినల్ ఫోటో గుర్తింపుకార్డు, బ్లూ లేదా బ్లాక్ పెన్నులు మాత్రమే తీసుకు రావాలన్నారు.

రిమ్స్‌లో ఎన్‌ఎంసీ అధికారుల తనిఖీలు

కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాల(రిమ్స్)లో పీజీ సీట్ల గుర్తింపు కోసం ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) అధికారులు శనివారం తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో జనరల్ మెడిసిన్ విభాగాన్ని గుజరాత్ రాష్ట్రానికి చెందిన డాక్టర్ జనక్‌కుమార్, కంటివిభాగాన్ని రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌కు చెందిన డాక్టర్ విజయ్ గుప్తా, గైనిక్ విభాగాన్ని గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన డాక్టర్ యామినీ త్రివేణి తనిఖీ చేశారు. జనరల్ మెడిసిన్ విభాగంలో 12 పీజీ సీట్లు, గైనిక్ విభాగంలో 7 పీజీ సీట్లు, కంటి విభాగంలో మూడు సీట్లు గుర్తింపు కోసం అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీబాయి, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీసుశీల, కంటి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: బేస్ లైన్ పరీక్ష ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులలో సామర్థ్యాలను మెరుగు పరిచే కార్యక్రమంలో భాగంగా 6,7,8 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా డీఆర్‌పీలు చర్యలు తీసుకోవాలని కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు దేవరాజు, రాఘవరెడ్డిలు సూచించారు. శనివారం కడప గాంధీనగర్ హైస్కూల్లో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలానికి ఒకరి చొప్పున ఎంపికైన డీఆర్‌పీలకు లిప్(లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం)లో రిపోర్టు తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కారణంగా విద్యార్థులు సామర్థ్యాలు వెనుకబడి పోయారని వాటిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లర్నింగ్ ఇంప్లిమెంట్ పోగ్రాం(లిప్) అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు చదవడం, రాయడం ఇంప్రూమెంట్ చేయడం లక్ష్యం అన్నారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధిని పెంపొందించడంతోపాటు రాయడం, చదవడం పెంచాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు ధనలక్ష్మి, రామాంజనేయులరెడ్డిలతోపాటు డీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972–73 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నారు. సుమారు 50 ఏళ్ల తర్వాత వారు కలవనున్నారు. ఇందులో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి కూడా ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల స్పెషల్ డ్రైవ్

కడప అర్బన్ : ప్రయాణ సమయంలో వాహనదారులు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ఎస్పీకేకేఎన్ అన్బురాజన్ సూచించారు. ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలతోపాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. రోడ్డు భద్రతా నియామవళిని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గురువారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 175 మందిపై, హెల్మెట్ లేని 103, సీటు బెల్ట్ ధరించని 72 మందిపై కేసులునమోదు చేశామన్నారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ గమ్య స్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



ఫకృద్దీన్ (ఫైల్)

ముద్దనూర్ : మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన వల్లూరు బాబా ఫకృద్దీన్ అనే యువకుడు అదృశ్యమైనట్లు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ ఆంజనేయులు సమాచారం మేరకు ఫకృద్దీన్ రోజువారీ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నె 9వ తేదీన పనికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి కనిపించకపోవడంతో ఫకృద్దీన్ తండ్రి, బంధువులు చుట్టుపక్కల విచారించారు. అచూకీ తెలియకపోవడంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు.

శాస్త్రీయ దృక్పథంతోనే ఆలోచనల అభివృద్ధి

ప్రారంభమైన జేవీవీ చెకుముకి రాష్ట్ర సైన్స్ సంబరాలు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కడప కల్చరల్ : మానవుడు బుద్ధి జీవి అని, ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుకూలంగా ఆలోచించగల శక్తి మానవుడికి మాత్రమే ఉందని, ఈ ఆలోచనలు శాస్త్రీయ దృక్పథంలో సాగినపుడే సమాజం అభివృద్ధి వైపు సాగుతుందని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. జేవీవీ రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు తొలిసారిగా కడపనగరంలో ప్రారంభమయ్యాయి. ప్రాంగణంలో తొలుత జెండా ఆవిష్కరణతో రెండు రోజుల కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జేవీవీ నాయకుడు, ప్రొఫెసర్ రామచంద్రయ్యతో కలిసి లక్ష్మణరావు ఉత్సవాల పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఇంకా శాస్త్రీయ దృక్పథంలో ఆలోచించడం, పాటించడం అభివృద్ధి చేసుకోవాలన్నారు. హరప్ప, మోహంజదారో నాగరికతల అభివృద్ధి గురించి వివరించారు. పిల్లల్లో శాస్త్రీయ ధోరణి పెంచడం కోసమే జేవీవీ 30 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తోందన్నారు. నిట్ మాజీ ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న సీవీ రామన్ గురించి, సైన్స్ దినోత్సవం, నోబుల్ బహుమతి గురించి విద్యార్థులకు వివరించారు. పరమాణువులు, ప్రొటాన్లు, క్లిక్ కెమిస్ట్రీ గురించి కూడా వివరించారు. సమాజంలో నేటికీ మూడ నమ్మకాలను పెంచే పెద్దలు ఉండడం దురదృష్టకరమన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు శాస్త్రీయ ధోరణి గల బాలలకు సైన్స్ పండుగ లాంటివన్నారు. తెలంగాణ జేవీవీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవుడన్న భావన, ఆవిర్భావం గురించి వివరించగా, శ్రీహరికోట డీజీఎం బాలమురళి మాట్లాడుతూ బాలల్లో అంతరిక్షం గురించి అవగాహన కల్పించేందుకు పలు పరికరాలు ప్రదర్శిస్తున్నామన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ కార్యక్రమ విశిష్టత గురించి వివరించారు.

ఈ సందర్భంగా షార్ నుంచి వచ్చిన బస్సును అతిథులు ప్రారంభించారు. పల్లవి, జ్ఞానేశ్వరి ఏర్పాటు చేసిన మెంచురల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టాల్‌ను కూడా ప్రారంభించారు. ఆర్.శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన సైన్స్ బుక్‌స్టాల్, ప్రదర్శనను కూడా ఏర్పాటు చేశారు. శ్రీహరి కోట నుంచి తెచ్చిన రాకెట్ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమం విజ్ఞాన దాయకంగా సాగింది. సైన్స్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, రఘునాథరెడ్డి, త్రిమూర్తులు, కేఎంఎంఆర్ ప్రసాద్, కుర్రా రామారావు, జిల్లా నాయకులు బాల బయన్న, వెంకటేశ్వర్లు, చెకుముకి ప్రతినిధి బాలు, వెంకట సుబ్బయ్య, రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం, స్థానిక ప్రతినిధులు వెంకట రామరాజు, సమత కన్వీనర్ పద్మావతి, సరస్వతి, సమీర్‌బాష, రంగనాయకులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, డేవిడ్, రాజశేఖర్, అల్తాఫ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

వాటర్ ప్లాంట్‌లలో విస్తృత తనిఖీలు



వాటర్ ప్లాంట్లలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కడప విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్లపై దాడులను నిర్వహించారు. కడప నగరంతో పాటు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, ప్రొద్దుటూరు, మదనపల్లె ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్స్ (జలశుద్ధి కేంద్రాలు)పై దాడులను నిర్వహించారు. ఐఎస్‌ఐ ప్రమాణాల గురించి, ఫుడ్ సేఫ్టీ అనుమతులు, జీఎస్టీ బిల్లులకు, నీటిశుద్ధికి సంబంధించిన ప్రమాణాలు, ప్రభుత్వ అనుమతుల గురించి తనిఖీలు చేపట్టారు. ఇన్‌స్పెక్టర్లు టి. రెడ్డెప్ప, జి. ఈదుర్ బాషా, పి. రామకృష్ణ, డిప్యూటీ ఈఈ పి. లోకేశ్వర్ రెడ్డి, ఏ.జి జి. శ్రీనివాసులు, ఏఈఈలు కె.వి కిషోర్, వి.అశోక్ కుమార్, ఏఓ బాలగంగాధర్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. కడప నగరంలో సైనిక్ నగర్‌లో వినాయక ఫుడ్ ప్రొడక్ట్స్, మామిళ్లపల్లిలో యురేఖా వాటర్ ప్లాంట్, మోడమీదపల్లిలో శ్రీనోకియా, చింతకొమ్మదిన్నె మండలంలోని సి.ఎం.ఆర్ పల్లిలో శ్రీ వినాయక ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, వెన్నెల వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేశారు. మదనపల్లె టౌన్‌లో మునెప్ప నగర్‌లో మహానంది ఆక్వా ప్రొడక్ట్స్, పుంగనూరు రోడ్డులో వలసపల్లిలోని లఖీ బేవరేజెస్, బ్రూక్లిన్ బేవరేజెలపై దాడులు నిర్వహించారు. తనిఖీలు చేసి నివేదికల తయారు చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలియజేశారు.

అన్నదాతకు ప్రయోజనకరమైన పరిశోధనలు రావాలి



మాట్లాడుతున్న గిరీశన్

వైవీయూ : వ్యవసాయ రంగంలో అన్నదాతకు ప్రయోజనకరమైన పరిశోధనలు జరగాలని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌శాఖ ఆధ్వర్యంలో 'వ్యవసాయ ప్రక్రియ సవాళ్లలో జిల్లా ప్రణాళిక' అన్న అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రైతులేనిదే ప్రజల జీవితాలు లేవని స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభాలకు అనుగుణంగా సహజమైన వాతావరణంలో కొత్త ఉత్పత్తులను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. పూణేకు చెందిన ఎంఐటీ వరల్డ్ పీస్ విశ్వవిద్యాలయం సంచాలకులు డా. కె. గిరీశన్ మాట్లాడుతూ తమిళనాడులో జిల్లా ప్రణాళిక యొక్క ప్రక్రియ, సవాళ్ల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాధాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి. పార్వతి, సదస్సు కన్వీనర్ డా. సతీష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో డా. ప్రమీళ మార్గరేట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిని వెంబడించి దాడి : కేసు నమోదు



గాయపడిన వెంకటసుబ్బయ్య

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో శనివారం ఉదయం ఓ వ్యక్తిపై జరిగిన దాడి సంచలనం సృష్టించింది. సినీఫక్కీలో ఆటోతో ఢీకొట్టి వెంబడించి కర్రలతో మరీ దాడి చేయడం పట్టణంలో చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం మేరకు బి.కోడూరు మండలం రామసముద్రం గ్రామానికి చెందిన చల్లా బాలవెంకటసుబ్బయ్య అలియాస్ బాలయ్య అనే యువకుడు డోజర్ బాడుగలకు పంపించుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయన వద్ద పట్టణంలోని శివానగర్‌కు చెందిన బత్తలగంగాధర్ డ్రైవర్‌గా పని చేస్తూ ఏడాది క్రితం మానేశాడు. తర్వాత వెంకటసుబ్బయ్య తన డోజర్‌ను అట్లూరులో అద్దెకు ఉంచగా అక్కడ డోజర్‌కు సంబంధించిన గొర్రు మాయమైంది. ఈ విషయంపై వెంకటసుబ్బయ్య విచారించగా గంగాధర్ గొర్రును తీసుకెళ్లినట్లు తేలింది. ఇదే విషయంపై గంగాధర్‌ను ప్రశ్నించగా గొర్రు తన వద్దే ఉందని, త్వరలోనే ఇస్తానని చెబుతూ కాలయాపన చేస్తుండేవాడు. ఈ క్రమంలో నెల్లూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు వద్దకు పెట్రోలు పట్టించుకునేందుకు ద్విచక్ర వాహనంలో వచ్చిన వెంకటసుబ్బయ్య పెట్రోలు బంకులో పనిచేస్తున్న గంగాధర్ కుమారుడు గోపాలక్రిష్ణను గొర్రు విషయమై ప్రశ్నించాడు. ఈ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గోపాలక్రిష్ణ జరిగిన విషయాన్ని తన తండ్రి అయిన గంగాధర్‌కు ఫోన్‌లో వివరించారు. వెంటనే ఆటోలో అక్కడికి చేరుకున్న గంగాధర్, గోపాలక్రిష్ణ, రాజాలు వెంకటసుబ్బయ్యపై దాడి చేశారు. భయంతో పరుగులు తీసిన వెంకటసుబ్బయ్యను నెల్లూరు రోడ్డు నుంచి రాధాకృష్ణనగర్ వరకు వెంబడించి కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో వెంకటసుబ్బయ్య గాయపడటంతో వారు అక్కడి నుండి వెనుదిరిగారు. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స చేయించుకున్న అనంతరం వెంకటసుబ్బయ్య పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో గంగాధర్, గోపాలక్రిష్ణ, రాజా అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల డిమాండ్స్ గవర్నరు తీరుస్తారా



మాట్లాడుతున్న ఎన్జీఓ నాయకులు

కడప రూరల్ : ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం మాత్రమే పరిష్కరిస్తుందని, గవర్నరు కాదని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్ తెలిపారు. కడపలోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ప్రభుత్వ ఉద్యోగులను మభ్యపెట్టడానికి మాత్రమే గవర్నర్‌ను కలిశారన్నారు. పైపెచ్చు దొడ్డిదారిన తమ సంఘానికి గుర్తింపు తెచ్చుకున్న సూర్యనారాయణ ఏపీఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తదితరులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారం మానుకొని ఉద్యోగుల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టి.తిమ్మారెడ్డి, బాలపుల్లయ్య, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, నగర అధ్యక్షుడు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



రైతు కుటుంబసభ్యులను విచారిస్తున్న అధికారులు

ముద్దనూరు : అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు గరైన రైతు ఖతా రామిరెడ్డి కుటుంబాన్ని త్రిసభ్య కమిటీ సభ్యులు శనివారం విచారించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి 2022 డిసెంబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్‌లు రామిరెడ్డి భార్య లక్ష్మీ సుబ్బమ్మ, అతని కుమారులను విచారించారు. ఆత్మహత్యకు గల కారణాలు, అప్పులు బ్యాంక్ రుణాలు తదితర సమస్యల గురించి త్రిసభ్య కమిటీ వివరాలు సేకరించింది. వ్యవసాయంపై చేసిన అప్పుల వల్లనే తన భర్త రామిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య లక్ష్మీ సుబ్బమ్మ త్రిసభ్య కమిటీకి తెలిపింది.

ముగిసిన దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు



రామాపురం : మండలంలోని దర్బార్ అనంత సాయి నగర్‌లో వెలసిన శ్రీ దర్గా స్వామిజీ ఆరాధనోత్సవాలు శనివారం ముగిశాయి. బెంగళూరుకు చెందిన వేద పండితులు పంచలోహ విగ్రహమైన స్వామి వారి మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, గంగపూజ, కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్ర నామార్చన, సాయంత్రం ఊయల ఉత్సవం జరిపారు. అనంతరం హోమాలు పూర్ణవృత్తి హోమం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి భక్తులు, ప్రముఖులు డాక్టర్ భయారెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఆటో ఢీ

– ఒకరికి తీవ్రగాయాలు

రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీ వీఆర్ కాలేజీ రోడ్డు వద్ద శనివారం సాయంత్ర ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో అబ్దుల్ అలి అనే వ్యకి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. సుండుపల్లెకు చెందిన అబ్దుల్ అలి ఆటో డ్రైవర్‌గా జీవనంగా సాగిస్తున్నాడు. శనివారం రామాపురం నుంచి రాయచోటికి వెళుతుంగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.ప్రమాద విషయం తెలియగానే లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు.108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

కారు అడ్డు తొలగించమన్నందుకు..

నలుగురిపై దాడి : తీవ్రగాయాలు



గోపాలకృష్ణ నుంచి స్టేట్‌మెంట్‌రికార్డు చేస్తున్న రిమ్స్ ఔట్‌పోస్టు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి

కడప అర్బన్ : కారు అడ్డు తొలగించమన్నందుకు నలుగురిపై శనివారం దాడి జరిగింది.ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..కడప నగరం ఓం శాంతినగర్‌లోని నిఖిల్ అపార్టుమెంటులోని 402లో జి.గోపాలకృష్ణ (47) నివాసం ఉంటున్నారు. అపార్టుమెంటు కింది భాగాన తనకు కేటాయించిన పార్కింగ్ స్థలంలో కారు, ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసుకునేవాడు. మూడు రోజుల కిందట అదే అపార్టుమెంటులో 202లో నివాసముంటున్న పుల్లారెడ్డి తన కారును పార్కింగ్ స్థలంలో గోపాలకృష్ణ కారు వెళ్లకుండా అడ్డంగా పెట్టాడని, తనకు న్యాయం చేయాలని గోపాలకృష్ణ అపార్టుమెంటు యజమానితోనూ మాట్లాడారు. తనకు న్యాయం జరగకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పుల్లారెడ్డిని స్టేషన్‌కు పిలిపించి అలా కారు పార్కింగ్ అడ్డంగా పెట్టకూడదని చెప్పి పంపించారు. ఇది మనసులో పెట్టుకుని పుల్లారెడ్డి తిరిగి శనివారం సాయంత్రం మోటారు సైకిల్‌ను గోపాలకృష్ణ కారుకు అడ్డంగా పెట్టాడు. తానుకారు బయటికి తీస్తున్నానని, మోటారు సైకిల్‌ను ప్రక్కకు తీయాలని చెప్పగా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతోపాటు గోపాలకృష్ణపై పుల్లారెడ్డి, గోపాలకృష్ణ సతీమణి స్వప్నపై పుల్లారెడ్డి భార్య దాడి చేసింది. మరికొందరు కూడా దాడిలో పాల్గొన్నారు. దీంతో గోపాలకృష్ణ, అతని భార్య, బావమరిది సునీల్‌కుమార్, సునీల్‌కుమార్ భార్య జ్యోతిలు గాయపడ్డారు. వీరు పోలీసుల సహాయం కోసం ఫోన్ చేయగా కమాండ్ కంట్రోల్ వారు వీరిని తమ వాహనంలో పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు తమ బంధువులతో కలిసి చిన్నచౌకు పోలీసుస్టేషన్ నుంచి రిమ్స్‌కు వెళ్లారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి క్యాజువాలిటీలో వైద్య సేవలు పొందుతుండగా, అదే సమయంలో పుల్లారెడ్డి అక్కడికి వచ్చి తెల్లారేలోపు నిన్ను, కుటుంబాన్ని చంపుతానని బెదిరించి వెళ్లాడు. ఈ మేరకు గోపాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప రిమ్స్ ఔట్‌పోస్టు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసి తదుపరి చర్యల కోసం చిన్నచౌకు పోలీసులకు సమాచారం పంపించారు. చిన్నచౌకు సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



న్యాయవాదులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న 3వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

రాజంపేట రూరల్ : క్రీడలతో మానసికోల్లాసం పొందొచ్చని 3వ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక బార్ అసోషియేషన్ కార్యాలయంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని శనివారం గేమ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. న్యాయవాదులతో కలిసి క్యారమ్స్ ఆడారు.సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి, జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బోయనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

మండల పరిధిలోని కొత్త బోయినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కే బోయినపల్లి ప్రజలు, సచివాలయ సిబ్బంది, న్యాయవాదులు, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో.. చిన్నారి 'తల్లి'

గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవం



ఆసుపత్రిలో విచారణ చేపట్టిన అధికారులు

వాల్మీకిపురం : తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రసవించిన సంఘటన శనివారం అన్నమయ్య జిల్లాలో చోటు చేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం కొత్త ఇందిరమ్మ కాలనీ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ బాలిక శనివారం సాయంత్రం కడుపునొప్పి అంటూ ఇబ్బందిపడసాగింది. దీంతో పాఠశాల యాజమాన్యం బాలికను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీరా వైద్యులు చికిత్సకు ఉపక్రమించిన సమయంలో బాలిక గర్భవతి అని తేలడం, నిమిషాల వ్యవధిలోనే మగ బిడ్డకు జన్మనివ్వడం జరిగిపోయింది. దీంతో డాక్టర్లు సైతం నివ్వెరపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఎస్సై బిందుమాధవి ఆసుపత్రికి చేరుకున్నారు. బాలికను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. విషయం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ దృష్టికి వెళ్లడంతో ఆయన పాఠశాల బాధ్యులు, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు హుటాహుటిన విచారణ చేపట్టారు. తనకు వరసకు మామ అయ్యే వ్యక్తి వల్లే బాలిక గర్భం దాల్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు

పెద్దమండ్యం : గుప్తనిధుల కోసం పురాతనమైన ఆలయంలో శుక్రవారం రాత్రి గుప్తనిధుల ముఠా తవ్వేసినట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. మండలంలోని దిగువపల్లె పంచాయతీలోని గుట్ట వద్ద వరమల్లయ్య స్వామి ఆలయం ఉంది. పెద్ద పెద్ద బండరాళ్లను గుప్తనిధుల ముఠా సభ్యులు తొలగించారు. శనివారం ఉదయం పూజలు చేసేందుకు ముసలికుంటకు చెందిన ఆలయ నిర్వాహకులు వెళ్లడంతో విషయం వెలుగుచూసింది. పురాతనమైన ఈ ఆలయంలో గతంలో రెండు మార్లు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేయగా పునర్నిర్మాణ పనులు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.